ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక




### ఆఫ్రికాలో 18 వేలకు చేరిన
## ఎంపాక్స్ కేసులు
### వ్యాపారుల ఆందోళన.. ఢిల్లీలో హైలెవెల్ మీటింగ్

న్యూఢిల్లీ, ఆగస్ట్ 18 (ప్రభాత ఉదయం): ఆఫ్రికా దేశాల్లో ఈ ఏడాది మంకీపాక్స్ వైరస్ సోకిన రోగుల సంఖ్య 18,737కు చేరింది. ఒక్క వారంలోనే 1200 కేసులు నమోదైనట్లు ఆఫ్రికా సమాఖ్య ఆరోగ్య సంస్థ వెల్లడించింది. ప్రాణాంతకమైన క్లేడ్ 1 వేరియంట్‌తోపాటు అన్ని రకాల వైరస్‌లతో కలిపి ఈ గణాంకాలు విడుదల చేసినట్లు పేర్కొంది. మొత్తంగా 541 మరణాలు సంభవించాయి. ఆఫ్రికా ఖండంలో 96శాతం కేసులు, మరణాలు కాంగోలోనే నమోదవుతుండగా ఈ ఒక్క వారంలో 222 కేసులు నిర్ధరణ కాగా 24 మంది మృత్యువాత పడ్డారు. 12 ఆఫ్రికా దేశాల్లో మంకీపాక్స్ కేసుల్ని గుర్తించగా మరణాలరేటు 2.89శాతంగా ఉంది. కాంగో సరిహద్దు దేశం బురుండిలో ..మిగతా 2లో


సంపుటి: 2 | సంచిక: 130 | పేజీలు: 4 | వెల: రూ.3/- | సోమవారం 19 ఆగస్ట్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్


### సర్వాయి పాపన్న స్వగ్రామాన్ని
# పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దుతాం
### డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్, ఆగస్ట్ 18 (ప్రభాత ఉదయం): హైదరాబాద్ నడిబొడ్డున సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. ఆయన జన్మస్థలాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. సర్దార్ పాపన్న 374వ జయంతి వేడుకలను పొన్నం అధ్యక్షతన హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో అధికారికంగా నిర్వహించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నేతలతో పాటు గౌడ సంఘాల నేతలు సైతం రాష్ట్రవ్యాప్తంగా జయంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు. సర్వాయి పాపన్న 374వ జయంతి సందర్భంగా ఆయన ధీర గాథను, జీవిత చరిత్రను నేతలు గుర్తు చేసుకున్నారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శమంటూ స్మరించుకున్నారు. హనుమకొండ జిల్లా పరకాలలో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. బడుగు బలహీన వర్గాలపై కొనసాగిన అణిచివేత దాడులకు వ్యతిరేకంగా పోరాడిన మహాయోధుడని కొనియాడారు. వేములవాడలో ప్రభుత్వవిప్ ఆదిశ్రీనివాస్ స్థానిక నాయకులతో కలిసి సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఆ యోధుడి ఆలోచన విధానాన్ని యువత కొనసాగించాలన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా సర్వాయి పాపన్న జయంతి వేడుకలు : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని కేక్ కట్ చేశారు. సిద్దిపేట జిల్లా భూంపల్లిలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య నివాళులర్పించారు. తెలంగాణ తొలిరాజు, బహుజన రాజ్యాధికార పోరాట యోధుడు పాపన్న అంటూ ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క వ్యాఖ్యానించారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నగరం నడిబొడ్డున పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ఆయన స్వగ్రామాన్ని పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. హైదారాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ సర్వాయి పాపన్నకు పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణభవన్‌లో జరిగిన జయంతి ఉత్సవంలో మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్ , సీనియర్ నేత పొన్నాల లక్ష్మయ్య పాల్గొన్నారు. సర్వాయి పాపన్న జయంతి వేడుకలను ప్రారంభించింది తమ ప్రభుత్వ హయాంలోనేనని పేర్కొన్నారు. సిద్దిపేటలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి మాజీమంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు నివాళులర్పించారు. బడుగులకు రాజ్యాధికారం కొరకు పాటుపడిన మహానుభావుడు పాపన్న గౌడ్ అని సిరిసిల్లలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్మరించుకున్నారు. ఏదో ఒక జిల్లాకు పాపన్న పేరు పెట్టాలని ప్రభుత్వానికి సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా గౌడ సంఘాల ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గౌడన్నలు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

### రాజకుటుంబాలకు చెంది పేదలుగా ఉన్నవారికి
## సంక్షేమ పథకాలు
### తెలుగు సినిమా ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన ప్రభాస్
### ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, ఆగస్ట్ 18 (ప్రభాత ఉదయం): హైదరాబాద్ శివారులో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తోన్న ఫ్యూచర్ సిటీ (ఫోర్త్ సిటీ)లో పెట్టుబడులు పెట్టాల్సిందిగా పారిశ్రామికవేత్తలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు పిలుపునిచ్చారు. ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాలకు ప్రాధాన్యత ఉంటుందని, తెలంగాణ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలన్నదే తమ అభిమతమని సీఎం తెలిపారు.

గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ క్షత్రియ సేవా సమితి వారు నిర్వహించిన అభినందన సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు పాల్గొన్నారు. అల్లూరి సీతారామరాజు, కొమురం భీమ్ స్ఫూర్తితో తెలంగాణ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని సీఎం తెలిపారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం అనుసరిస్తోన్న నూతన విధానాలను, చేపట్టిన కార్యక్రమాలను ముఖ్యమంత్రి తన సందేశంలో ప్రస్తావించారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ సహా అనేక ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను ఫ్యూచర్ సిటీలో చేపట్టామని, ఇటీవలి తన విదేశీ పర్యటనల్లోనూ అంతర్జాతీయ సంస్థలు హైదరాబాద్ ఫోర్త్ సిటీపై ఆసక్తి చూపించాయని ముఖ్యమంత్రి తెలిపారు. వ్యక్తిగత శ్రమ, విధేయత ఒక మనిషిని ఉన్నత స్థానానికి చేరుస్తాయని, నేపథ్యాలు వేరైనప్పటికీ కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ గారు, కర్ణాటక మంత్రి నడింపల్లి బోసురాజు అలా కష్టపడి పైకి వచ్చినవారే అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు గుర్తుచేశారు.

హైదరాబాద్ లో క్షత్రియ భవన్ కు స్థలం కేటాయింపు, అనుమతుల విషయంలో ప్రభుత్వం సహకరిస్తుందని, పేద క్షత్రియులకు కూడా సంక్షేమం అందజేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా క్షత్రియ సేవా సమితి వారు ముఖ్యమంత్రిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు శ్రీనివాస రాజు గారు, పలువురు ప్రజా ప్రతినిధులు, క్షత్రియ సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

## జూరాలకు మళ్లీ పెరిగిన వరద

గద్వాల ,ఆగస్టు18(ప్రభాత ఉదయం) ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహం మళ్లీ పెరిగింది. నీటి ప్రవాహం తగ్గడంతో వారం రోజుల క్రితం గేట్లు మూసివేయగా..మూడు రోజుల నుంచి జూరాలకు వరద ప్రవాహం పెరిగింది. ఆదివారం రాత్రి 9.45 గంటల సమయంలో ప్రాజెక్టుకు 54,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా..అయిదు క్రస్టు గేట్ల ద్వారా 20,865 క్యూసెక్కుల నీటిని శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేశారు. అదేవిధంగా 5 యూనిట్లలో విద్యుదుత్పత్తి కోసం 40,340 క్యూసెక్కులు వదులుతుండగా..మొత్తంగా జూరాల నుంచి 64,515 క్యూసెక్కుల ఔట్ ఫ్లో ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా...ప్రస్తుతం 9.480 టీఎంసీలుగా ఉంది.





### కోల్‌కతా లైంగిక దాడి..
### హత్య కేసును సుమోటోగా
## స్వీకరించిన సుప్రీం
### 20న విచారణ

కోల్‌కతా, ఆగస్ట్ 18 (ప్రభాత ఉదయం): కోల్‌కతా ఆర్జీ కార్ దవాఖాన మెడికల్ కాలేజీ వైద్యురాలిపై లైంగికదాడి, హత్య కేసును సుప్రీంకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించింది. ఈ నెల 20న చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలోని బెంచ్ విచారించనున్నది. ఒకవైపు దేశవ్యాప్త నిరసనలు, మరొకవైపు హెల్త్ కేర్ సర్వీసుల నిలిపివేత నేపథ్యంలో సుప్రీం కోర్టు నిర్ణయానికి ప్రాధాన్యం ఏర్పడింది. కోల్‌కతాలోని ఆర్జీ కార్ మెడికల్ కాలేజీ పీజీ ట్రైనీ విద్యార్థిని డ్యూటీలో ఉండగా లైంగిక దాడి, హత్యకు గురయ్యారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపింది. రాష్ట్రాల్లో వైద్యులు ఆందోళన బాట పట్టారు. పౌర సమాజం నిరసనకు దిగారు. ఈ ఘటనలో నిందితులకు తీవ్రమైన శిక్ష విధించాలని, తమకు భద్రత కల్పించాలని వైద్యులు డిమాండ్ చేశారు. ఇంతకుముందు సుప్రీంకోర్టులో న్యాయవాద వృత్తిలో ఉన్న ఇద్దరు న్యాయవాదులు చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ కు లేఖ ..మిగతా 2లో

### విద్యుత్ శాఖలో
# భారీ స్థాయిలో పదోన్నతులు

సంతోషం వ్యక్తం చేసిన ఉద్యోగులు
గత పదేళ్లలో మాకు అన్యాయం జరిగింది
సీఎం, డిప్యూటీ సీఎంలకు ధన్యవాదాలు తెలిపిన ఉద్యోగులు
2017 నుండి పెండింగ్‌లో వున్న పదోన్నతులకు ఈరోజు మోక్షం...
పదోన్నతుల వలన ఏర్పడిన ఖాళీల భర్తీకి నిర్ణయం తీసుకునే అవకాశం

హైదరాబాద్, ఆగస్టు18(ప్రభాత ఉదయం) దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చరిత్రలో మొట్ట మొదటిసారిగా ఒకే రోజులో భారీ స్థాయిలో 2263 మంది ఉద్యోగులకు పదోన్నతులు ..మిగతా 2లో



విద్యుత్ శాఖలో పదోన్నతులు ఇచ్చిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, సిఎండి ముషారఫ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న ఉద్యోగులు

## అక్రమ నిర్మాణదారుల గుండెల్లో దడ పుట్టిస్తున్న హైడ్రా



గండిపేట్ మండలంలో ఎఫ్ టి ఎల్ చేపట్టిన నిర్మాణాలను కూల్చివేస్తున్న హైడ్రా అధికారులు

ఎక్కడికక్కడ అక్రమ నిర్మాణాలు నేల మట్టం
గండిపేట, మొయినాబాద్ మండలాలలో అక్రమ నిర్మాణాలపై కొరడా
భారీగా పోలీసుల మోహరింపు
కూల్చివేతలను అడ్డుకునేందుకు ప్రయత్నించిన వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

గండిపేట్/మొయినాబాద్, ఆగస్టు18 (ప్రభాత ఉదయం) గత ప్రభుత్వ హయాంలో రాజేంద్రనగర్, చేవెళ్ల నియోజకవర్గాలలో ఉన్న చెరువులు నాళాలు కుంటలు ఫిరంగి నాళాలను ఆక్రమించి అక్రమ నిర్మాణాలకు తెరలేపిన కబ్జా దారులకు కొత్తగా ఏర్పడిన రేవంత్ సర్కార్,రాష్ట్ర వ్యాప్తంగా ఆక్రమణకు గురైన చెరువులపై చర్యలు తీసుకునేందుకు హైడ్రా కమిషన్ ఏర్పాటు చేసిన సంగతి ..మిగతా 2లో



### త్వరలోనే రైతులందరికీ
## రుణమాఫీ
### మంత్రి పొంగులేటి

వరంగల్, ఆగస్ట్ 18 (ప్రభాత ఉదయం): రాష్ట్రవ్యాప్తంగా రైతు రుణమాఫీకి రూ.19వేల కోట్ల నిధులు మంజూరు చేశామని, మరో రూ.12వేల కోట్లు త్వరలోనే మంజూరు చేసి త్వరలోనే రైతులందరికీ రుణమాఫీని పూర్తి చేస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. హనుమకొండ జిల్లా పరకాల పట్టణంలోని నూతన మున్సిపాలిటీ భవనంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఎంపీ కడియం కావ్య, కలెక్టర్ ప్రావిణ్యతో కలిసి అమృత్ పథకం-2లో భాగంగా రూ. 11.74కోట్లతో పలు అభివృద్ధి పనులు, రూ.5కోట్లతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మున్సిపాలిటీ కార్యాలయంలో నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర రాజధానిలో జరిగిన పలు సమీక్షల్లో పరకాల అభివృద్ధిపై చర్చించామన్నారు. టెక్స్‌టైల్ పార్కును దేశంలోనే రోమ్ మోడల్ పార్కుగా తీర్చిదిద్దాలని సీఎం రేవంత్ ఆలోచనలో ఉందన్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భూమి కోల్పోయిన రైతులకు మంచి ధర చెల్లించి అండగా ఉంటామని, భూ సేకరణ పూర్తి చేసి కేంద్ర ప్రభుత్వానికి అప్పగిస్తామని హామీ ఇచ్చారు.

# అక్రమ నిర్మాణదారుల గుండెల్లో దడ పుట్టిస్తున్న హైడ్రా



మొయినాబాద్ మండలంలో గండిపేట చెరువులో నిర్మించిన అక్రమ కట్టడాలను కొలుస్తున్న అధికారులు



కుప్పకూలిన పెద్ద భవంతి

**మొదటి పేజీ తరువాయి...**

విధితమే. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశానుసారం గండిపేట్ మండలం ఖానాపూర్ ప్రాంతంలో ఉస్మాన్ సాగర్ చెరువు బఫర్ జోన్ ప్రాంతంలో ఇరువైపులా వెలిసిన భారీ అక్రమ నిర్మాణాలపై అధికారులు ఉక్కు పాదం మోపారు. ఎక్కడికక్కడ అక్రమ నిర్మాణాలను నెలమట్టం చేశారు. మొన్న రాజేంద్రనగర్ సర్కిల్ పరిధి శివరాంపల్లి ఎన్.పి.ఎ, ఎదురుగా ఉన్న భమ్ రూక్ దౌల నాథ్ చెరువు అన్యాక్రాంతం పై హైడ్రా కొరడా ఝులిపించింది. తాజాగా గండిపేట్ జలాశయం బఫర్ ప్రాంతంలో వెలిసిన అక్రమ నిర్మాణాలను భారీ మిషనరీలతో నేలమట్టం చేశారు. ఈ కూల్చివేతల ప్రక్రియ ఆదివారం ఉదయం నుండి సాయంత్రం వరకు కొనసాగింది. కూల్చివేతల్లో ఎలాంటి గొడవలు తేలేత్తకుండా నార్సింగి ఏసిపి రమణ గౌడ్,నేత్రత్వంలో ఇన్స్పెక్టర్ హరికృష్ణ రెడ్డి పర్యవేక్షణలో భారీగా పోలీసులను మొహరించారు. అక్రమ నిర్మాణదారుల గుండెల్లో దడ పుట్టిస్తున్న హైడ్రా. ఎక్కడికక్కడ అక్రమ నిర్మాణాలు నేల మట్టం చేస్తున్న వైనం. కూల్చివేతలను అడ్డుకునేందుకు ప్రయత్నించిన పలువురిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించిన పోలీసులు.నార్సింగి మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, శ్రీధర్ గౌడ్,మణిహారిక, శానిటేషన్ విభాగం ఇన్స్పెక్టర్ లచ్చిరాం, జలమండలి,విద్యుత్ శాఖ,ఇరిగేషన్, అధికారులు,డిజాస్టర్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### రేస్టో రెంట్ నిర్మాణంలో భారీగా ముడుపులు??

బఫర్ జోన్ లో నిర్మాణాలు చేపట్టేందుకు కోట్ల రూపాయలు చేతులు మారినట్టు తెలుస్తుంది. బఫర్ జోన్ ప్రాంతంలో అన్ని శాఖల అధికారులను మచ్చిక చేసుకుని ముడుపులు అందించి అక్రమ నిరణాలను చేపట్టినట్టు బహిరంగ ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఖానాపూర్ ప్రధాన రహదారిపై బఫర్ ప్రాంతంలో నిర్మిస్తున్న ఓ రిస్టో రెంట్ నిర్మాణానికి సంబంధించి ఏకంగా 40 లక్షలను అధికారులు, పాలక వర్గం పంచుకోమని ముట్టజెప్పినట్టు బహిరంగ ఆరోపణలు వస్తున్నాయి.ఇంత పెద్ద మొత్తంలో ముడుపులు అందజేసిన తమ నిర్మాణం నేలమట్టం చేయడంతో చేసేదేమి లేక ఎవరిని అడగలేక తలలు పట్టుకుంటున్న సదరు వ్యక్తులు. అక్రమ నిర్మాణాల పైన హైడ్రా అధికారుల ఉక్కు పాదం

### మొయినాబాద్ మండలం లో...

మండల పరిధిలోని చిలుకూరు గ్రామ పరిధిలో అక్రమ నిర్మాణాల పైన ఆదివారం హైడ్రా అ ధికారులు కొరడా ఝులిపించారు. మొయినాబాద్ మండలంలోని చిలుకూరు గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న వెస్ట్ సైడ్ వెంచర్ లో గండిపేట చెరువు ఎఫ్ టి ఎల్ లో అక్రమంగా నిర్మించిన భారీ నిర్మాణాలను హైడ్రాధికారులు కూల్చివేశారు. హైడ్రా అధికారులు ఏఈ మల్లికార్జున్, జలమండలి విజిలెన్స్ ఇన్స్పెక్టర్ లక్ష్మి రెడ్డి, హెచ్ఎండిఏ అధికారులు , మొయినాబాద్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పవన్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసుల భారీ బందోబస్తు మధ్యన నిర్మాణాలను కూల్చివేశారు. ప్రభుత్వ భూములు, చెరువులు అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను అధికారులు నేలమట్టం చేశారు. అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న విషయం తెలిసిన స్థానికులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకోవడంతో పోలీసులు వారిని అడ్డగించారు. కొంతసేపు వాగ్వాదం జరిగింది. కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అనుమతులు లేకుండా అక్రమంగా ప్రభుత్వ స్థలంలో ఎఫ్ టి ఎల్ బఫర్ జోన్లలో నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# విద్యుత్ శాఖలో భారీ స్థాయిలో పదోన్నతులు

**మొదటి పేజీ తరువాయి...**

కల్పిస్తూ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ముషారఫ్ ఫరూఖీ ఐఏఎస్ ఆదేశాలు జారీ చేసారు. ఇంజినీరింగ్ సర్వీస్ లో 101, అకౌంట్స్ సర్వీస్ లో 47, ఓ అండ్ ఎం సర్వీస్ లో 2099, పి అండ్ జిసర్వీస్ లో 16 మంది అధికారులు, సిబ్బందికి పదోన్నతులు లభించాయి. ఉప ముఖ్య మంత్రి , తెలంగాణ రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఈ నెల 8 వ తేదీన దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఆ సమీక్షా లో పాల్గొన్న పలువురు అధికారులు 2017 నుండి పెండింగ్ లో వున్న పదోన్నతుల గురించి ఉప ముఖ్య మంత్రి బట్టి విక్రమార్క దృష్టికి తీసుకురావడం జరిగింది. ఎన్నో ఏళ్లుగా పదోన్నతులకు నోచుకోని ఉద్యోగుల నైతిక స్థైర్యం దెబ్బతింటున్న విషయాన్ని గ్రహించిన ఉప ముఖ్య మంత్రి పెండింగ్ లో వున్న పదోన్నతులకు సంభందించిన కార్యాచరణను వెంటనే ప్రారంభించాల్సిందిగా సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ని ఆదేశించారు. వాస్తవానికి 2017 నుండి పదోన్నతులు పెండింగ్ లో ఉండటం మూలంగా, అర్హులైన చాలా మంది పదోన్నతులు పొందకుండానే రిటైర్ అయ్యారు. 2263 మంది సిబ్బందికి పదోన్నతుల వలన ఖాళి అయిన పోస్టుల భర్తీ కి సైతం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలననుసారం చర్యలు తీసుకుంటామని సీఎండీ తెలిపారు. 2017 నుండి, అంటే దాదాపుగా ఏడున్నరేళ్లుగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులకు భారీ స్థాయిలో పదోన్నతులకు ఆమోదం తెలిపి అదేశాలు ఇప్పించిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క , సంస్థ సీఎండీ లకు విద్యుత్ ఉద్యోగులు అధికారులు పాలాభిషేకం చేసి తమ ఆనందాన్ని తెలియజేసారు.






### కోల్‌కతా లైంగిక దాడి..

# హత్య కేసును సుమోటోగా స్వీకరించిన సుప్రీం

**మొదటి పేజీ తరువాయి...**

రాశారు. ఈ ఘటనను సుమోటోగా విచారణకు స్వీకరించాలని కోరారు. 'క్రూరత్వంతో మూగబోయిన బాధితులకు ఈ కేసులో న్యాయ వ్యవస్థ ద్వారానే న్యాయం జరుగుతుందని యావత్ దేశం చూస్తోంది. ఇతరులకు సేవ చేయడానికి జీవితాన్ని అంకితం చేసిన యువ వైద్యురాలి మరణానికి తగిన న్యాయం చేకూర్చాలి. భవిష్యత్ లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి' అని ఆ లేఖలో పేర్కొన్నారు. మరోవైపు ఈ కేసుపై సీబీఐ దర్యాప్తు చేపట్టింది. ఆర్జీ కార్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్ మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్ కాల్ డేటా, చాటింగ్ వివరాలను పరిశీలిస్తోంది. వరుసగా మూడో రోజు ఆదివారం కూడా సందీప్ ఘోష్ ను విచారించింది. ఇప్పటికే ప్రధాన నిందితుడితోపాటు 20 మందిని సీబీఐ అదుపులోకి తీసుకున్నది. సందీప్ ఘోష్ మొబైల్ ఫోన్ సర్వీసు ప్రొవైడర్ల నుంచి కాల్ డేటా, చాట్ వివరాలను సేకరించడానికి ప్రయత్నిస్తున్నది. ఇతర డాక్టర్ల అభిప్రాయాలను, సందీప్ ఘోష్ వివరణలను సరిపోల్చి చూస్తోంది.

### ఆఫ్రికాలో 18 వేలకు చేరిన

# ఎంపాక్స్ కేసులు

**మొదటి పేజీ తరువాయి...**

ఈ వారంలో 39 కేసులు నిర్ధరణ అయ్యాయి. ఆఫ్రికా వెలుపల పాకిస్థాన్, స్వీడన్‌లో మంకీపాక్స్ కేసులు వెలుగుచూశాయి. మంకీపాక్స్ వైరస్ విజృంభణ వేళ ప్రపంచ ఆరోగ్య సంస్థ WHO ఇప్పటికే అంతర్జాతీయ ఆందోళనతో కూడిన అత్యవసర స్థితిని ప్రకటించింది. విపత్తుపై అత్యవసర కమిటీని ఏర్పాటు చేసింది. త్వరలో ఆ కమిటీ తొలి దశ సిఫార్సుల్ని ప్రచురిస్తామని WHO తెలిపింది. WHOలతో కలిసి టీకా ఉత్పత్తిని వేగవంతం చేయాలని పిలుపునిచ్చింది.

### వ్యాపారుల ఆందోళన

జింబాబ్వేలో సమావేశమైన దక్షిణాఫ్రికా డెవలప్‌మెంట్ సొసైటీ దేశాలు కోరలు చాస్తున్న ఎంపాక్స్ వైరస్‌పై చర్చించారు. WHOతో పాటు పలు దేశాల వ్యాధి నియంత్రణ సంస్థలు, అంతర్జాతీయ భాగస్వాములు మంకీపాక్స్ నివారణకు కృషి చేయాలని అభ్యర్థించారు. ప్రభావిత దేశాలకు సంఘీభావం, మద్దతును ప్రకటించారు. మంకీపాక్స్ అంటువ్యాధి ప్రబలుతున్న సమయంలో ఆఫ్రికాతో ఎగుమతి, దిగుమతులు జరిపే వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతానికి పరిస్థితులు విషమించకున్నా వ్యాధి వ్యాప్తి గురించి భయపడుతున్నట్లు చెబుతున్నారు. ప్రపంచ దేశాలు వాణిజ్య నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

### దిల్లీలో ఉన్నతస్థాయి సమావేశం

భారత్‌లో ప్రస్తుతానికి ఎంపాక్స్ కేసులు వెలుగుచూడలేదు. అయినప్పటికీ WHO సూచనల దృష్ట్యా వ్యాధి వ్యాప్తి నివారణకు అన్ని జాగ్రత్త చర్యలు తీసుకుంటామని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. అన్ని విమానాశ్రయాలు, ఓడరేవులు, గ్రౌండ్ క్రాసింగ్‌లలోని ఆరోగ్య విభాగాలను అప్రమత్తం చేసింది. మరోవైపు, ఎంపాక్స్ వ్యాప్తి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యల సంసిద్ధతపై పీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ ప్రమోద్ కుమార్ మిశ్రా ఆదివారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఆరోగ్యం, హోం, విపత్తు నిర్వహణ, ఆరోగ్య పరిశోధనల కార్యదర్శులతోపాటు సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

### మంకీపాక్స్ అంటే ఏంటి?

ఎంపాక్స్ ఒక వైరల్ వ్యాధి. ఇది వ్యాధి సోకిన జంతువుల లేదా మనుషుల నుంచి వ్యాప్తి చెందుతుంది. రోగితో లైంగిక లేదా సన్నిహితంగా మెలిగినా వైరస్ వ్యాప్తి చెందుతుంది. జ్వరం, కండరాల నొప్పులు, చర్మంపై పొక్కులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. గతంలో వ్యాపించిన వైరస్ నోరు, ముఖం, చేతులు, కాళ్లపై ప్రభావం చూపిస్తే ప్రస్తుతం ఎక్కువగా జననేంద్రియాల వద్ద ప్రభావం చూపిస్తోంది. ఫలితంగా రోగుల గుర్తింపు కష్టమై వైరస్ వేగంగా వ్యాపిస్తోంది. 1970లో కాంగోలో తొలిసారి ఇది మనిషికి సోకినట్లు గుర్తించారు. ప్రాణాంతకమైన క్లాడ్ 1 వేరియంట్ ఎక్కువగా కాంగో బేసిన్‌లోనే ఎక్కువగా ఉంది.



# జార్ఖండ్ మాజీ సీఎం చంపై సోరెన్ భావోద్వేగం

### రాజకీయంపై తన ముందు మూడు మార్గాలున్నాయంటూ పోస్ట్

న్యూఢిల్లీ, ఆగస్ట్ 18 (ప్రభాత ఉదయం): జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి చంపై సోరెన్ తన రాజకీయ భవితవ్యంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన బీజేపీలో చేరనున్నారన్న వార్తల నేపథ్యంలో ఆదివారం సోషల్ మీడియా వేదికగా భావోద్వేగ పూరిత వ్యాఖ్యలు చేశారు. తన ముందు మూడు మార్గాలు ఉన్నాయని 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేశారు. 'రాజకీయాల నుంచి పూర్తిగా వైదొలగడం, విడిగా రాజకీయ పార్టీ ఏర్పాటు చేయడం, కలిసి వచ్చే పార్టీతో కలిసిపని చేయడం' అనే ఆప్షన్లు ఉన్నాయని పేర్కొన్నారు. తన ఆత్మ గౌరవానికి దెబ్బ తగిలిందని వ్యాఖ్యానించారు. దీంతో తన మనస్సుకు గాయమైందన్నారు. అవినీతి కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్ట్ చేయడానికి ముందు జార్ఖండ్ సీఎంగా హేమంత్ సోరెన్ రాజీనామా చేశారు. ఆయన స్థానంలో చంపై సోరెన్ సీఎంగా బాధ్యతలు స్వీకరించారు. ఇటీవలే బెయిల్ మీద బయటకు రాగానే చంపై సోరెన్ స్థానంలో తిరిగి హేమంత్ సోరెన్ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. అర్ధంతరంగా తనను సీఎం పదవి నుంచి తప్పించడం చంపై సోరెన్‌కు మనస్తాపం కలిగించినట్లు కనిపిస్తున్నది. బీజేపీలో చేరేందుకే ఢిల్లీ వచ్చారన్న వదంతులను ఆయన కొట్టి పారేశారు. ఢిల్లీలో ఉన్న తన కూతుర్ని కలవడానికి మాత్రమే వచ్చానని చెప్పారు.

# ఘోర ప్రమాదం

### రక్షాబంధన్ వేడుకలకు వెళ్తున్న కూలీల ట్రక్కును ఢీకొన్న బస్సు..10 మంది మృతి

న్యూఢిల్లీ, ఆగస్ట్ 18 (ప్రభాత ఉదయం): ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రక్షాబంధన్ వేడుకలు జరుపుకునేందుకు ఇంటికి వెళ్తున్న కూలీల పికప్‌ను బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పది మంది మృతి చెందగా, పలువురు చిన్నారులు సహా 29 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రిలో చేర్పించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల కథనం ప్రకారం.. అలీఘర్‌లోని అత్రౌలీ తహసీల్‌లోని అహెరియా నాగ్లా గ్రామానికి చెందిన కార్మికులు ఘజియాబాద్‌లోని ఒక ఫ్యాక్టరీలో పని చేసేవారు. రక్షాబంధన్ పండుగను పురస్కరించుకుని కూలీలంతా ఆదివారం ఉదయం 8 గంటల ప్రాంతంలో ఘజియాబాద్ నుంచి పికప్‌లో తమ తమ గ్రామాలకు తిరిగి వస్తున్నారు. ఉదయం10.15 ప్రాంతంలో సేలంపూర్ వద్దకు రాగానే వేగంగా వస్తున్న బస్సు పక్క నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదం అనంతరం రోడ్డుపై పడిన క్షతగాత్రులను స్థానికులు ప్రయివేటు వాహనాలు, అంబులెన్స్‌ల సాయంతో ప్రయివేటు ఆసుపత్రితోపాటు జిల్లా ఆసుపత్రికి తరలించారు. అలాగే బస్సులో చిక్కుకున్న డ్రైవర్‌ను రక్షించే ప్రయత్నం చేశారు. అనంతరం క్రేన్ సాయంతో బస్సులో ఇరుక్కున్న డ్రైవర్‌ను బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి చేరుకున్న క్షతగాత్రులలో పది మంది మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. బదౌన్ నుంచి ఢిల్లీకి వెళ్తున్న దగ్గమార్ బస్సు డ్రైవర్ అతి వేగంతో మరో వాహనాన్ని ఓవర్ టేక్ చేశాడు. రోడ్డుపై పెద్ద సంఖ్యలో వాహనాలు ఉండటంతో.. డ్రైవర్ ట్రాక్‌పైకి మళ్లించాడు. దీంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఉదయం 10.15 గంటల ప్రాంతంలో ప్రమాదం జరిగిందని, అనంతరం పోలీసులకు సమాచారం అందించగా.. అరగంట ఆలస్యంగా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారని స్థానికులు ఆరోపించారు.

# రాహుల్, ఖర్గేలకు కేటీఆర్ లేఖ

### రేవంత్ రెడ్డిపై ఫిర్యాదు



హైదరాబాద్, ఆగస్ట్ 18 (ప్రభాత ఉదయం): తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి కాంగ్రెస్ సర్కార్ రుణమాఫీ పేరుతో రాహుల్ గాంధీ మోసం చేశారని విమర్శిస్తూ.. మాజీ మంత్రి కేటీఆర్ రాహుల్ గాంధీకి, కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేకి లేఖ రాశారు. తెలంగాణలో రుణమాఫీ అందని లక్షలాది మంది రైతుల తరపున ఈ లేఖ రాస్తున్నానని కేటీఆర్ తెలిపారు. సీఎం చెప్పిన అబద్ధాలు, క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవాలకు మధ్య ఉన్న స్పష్టమైన తేడాను ఈ లేఖలో పొందుపరిచారు.

"మీ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ నిర్వాకం వలన ధగా పడిన లక్షలాది మంది తెలంగాణ రైతుల తరపున మీకు ఈ లేఖ రాస్తున్నాను. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వైఫల్యాలతో ముఖ్యంగా ప్రభుత్వం ఘనంగా చెప్పుకుంటున్న రైతు రుణమాఫీ మోసం వలన లక్షలాదిమంది రైతులు తీవ్రమైన ఆవేదనలో ఉన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వరంగల్ రైతు డిక్లరేషన్ పేరిట మీరు విడుదల చేసిన హామీలో రైతులకు రెండు లక్షల రుణమాఫీ అనేది అత్యంత కీలకమైన అంశం అనే విషయాన్ని మీకు గుర్తు చేస్తున్నాను.

అబద్ధాలు, అభూతకల్పనలతో తెలంగాణలో అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ రైతులను నిలువునా మోసం చేస్తున్నారు. అధికారంలోకి రాగానే డిసెంబర్ 9న ఏకకాలంలో 2 లక్షల రుణమాఫీ చేస్తామని ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టిన సీఎం రేవంత్.. 3 విడతలుగా మోసం చేస్తూ.. 8 నెలలుగా ఊరించి ఊరించి చివరికి రైతులను ఉసూరుమనిపించారు. కనీసం 40 శాతం కూడా రుణమాఫీ పూర్తిచేయకుండానే వందశాతం రుణమాఫీ పూర్తయిపోయిందని ప్రకటించడం వందకు వందశాతం అబద్ధం. అందుకే తెలంగాణలో రుణమాఫీ పేరిట జరిగిన నయవంచనకు సంబంధించిన లెక్కలు మీకు తెలుసో లేదో అనే ఉద్దేశంతో సీఎం చెప్పిన అబద్ధాలు, క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవాలకు మధ్య ఉన్న స్పష్టమైన తేడాను ఈ లేఖలో పొందుపరుస్తున్నాను.

గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు లక్షరూపాయల రుణమాఫీ చేస్తేనే 17 వేల కోట్లు ఖర్చయింది. ఏకంగా 36 లక్షల మంది రైతులు రుణవిముక్తులై లబ్ది చేకూరింది. కాంగ్రెస్ చెబుతున్నట్టు రెండు లక్షల రుణమాఫీ పూర్తయితే.. లబ్దిదారుల సంఖ్యతోపాటు రుణమాఫీ మొత్తం పెరగాలి, దాదాపు రెట్టింపు కావాలి. కానీ కేవలం 17,900 కోట్లతో రెండు లక్షల రుణమాఫీని పూర్తిచేశామనడం ముఖ్యమంత్రి డొల్లవాదనకు నిదర్శనం. 47 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి 22 లక్షల మందికి తూతూమంత్రంగా చేయడం.. కాంగ్రెస్ సర్కారు అసమర్థతకు కేరాఫ్ అడ్రస్ గా నిలుస్తోంది.

అసలు లక్ష రూపాయల రుణమాఫీ కన్నా.. రెండు లక్షల రుణమాఫీ లబ్దిదారుల సంఖ్య 14 లక్షలు తగ్గడం రైతు రుణమాఫీ ఏ మేరకు విఫలమైందో అద్దం పడుతుంది. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ లెక్క ప్రకారం రెండు లక్షల రుణమాఫీకి 49,500 కోట్లు అంచనా వేశారు. ముఖ్యమంత్రే స్వయంగా రుణమాఫీకి 40వేల కోట్ల వరకు అవుతుందని తొలుత చెప్పుకొచ్చారు. కడుపు కట్టుకుంటే.. ఇది పెద్ద విషయం కాదని ఇంటర్వ్యూల్లో గొప్పలు చెప్పారు. చివరికి రాష్ట్ర కేబినెట్ సమావేశం వరకు వచ్చే సరికి 31 వేలకు దీన్ని కుదించారు. కనీసం అంతమేరకైనా చేశారా అంటే అదీ లేదు.


రాష్ట్ర బడ్జెట్ లో మరింత కోత పెట్టి 26 వేల కోట్లు మాత్రమే కేటాయించారు. తీరా మూడు విడతల రుణమాఫీ తతంగాన్ని రూ.17,933 కోట్లతో మమ అనిపించారు. 49,500 కోట్ల రూపాయల రెండు లక్షల రుణమాఫీ కాస్తా.. మూడు విడతల్లో దాదాపు మూడింతలు తగ్గి 17,933 చేరింది. 40 శాతం కూడా రుణమాఫీ చేయకుండా.. లక్షలాది మంది రైతులను నట్టేట ముంచి ప్రక్రియ పూర్తయిందని సీఎం రేవంత్ రెడ్డి చేతులెత్తేయడంతో.. యావత్ తెలంగాణ ఇవాళ రైతుల ఆందోళనలతో అట్టుడుకుతోంది.

కాంగ్రెస్ అధిష్టానానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే.. రైతులను నిలువునా మోసం మోసం చేసిన ఈ రాష్ట్ర కాంగ్రెస్ సర్కారు తన వైఖరి మార్చుకొని రాష్ట్రంలోని అన్నదాతలందరికీ ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని రాష్ట్రంలోని అన్నదాతల పక్షాన డిమాండ్ చేస్తున్నాం. అప్పటివరకు తెలంగాణ రైతాంగం పక్షాన పోరాటం చేస్తామని తెలియజేస్తున్నాను" అని లేఖలో రాశారు.

# ఘనంగా శివ కార్తీక్-మనుశ్రీల వివాహ వేడుక



వివాహ వేడుకలలో కార్తీక్ రెడ్డి..



శివ కార్తీక్ - మను శ్రీ (శిరీష) వివాహ వేడుకలకు హాజరైన బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకులు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, తదితరులు

## హాజరైన పలువురు రాజకీయ నేతలు

బుద్వేల్, ఆగస్టు18(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్ గూడ వాస్తవ్యులు కొండమీది హరినాథ్ - పుష్పలత ల కుమారుడు శివ కార్తీక్ తో మణికొండ వాస్తవ్యులు పెంద్యాల సక్కుబాయి , కీర్తిశేషులు యాదయ్య ల కుమార్తె మను శ్రీ ల వివాహం ఆదివారం మొయినాబాద్ మండలం హిమాయత్ నగర్ ఎంకేపల్లి రోడ్డు లో గల జేపి ఎల్ కన్వెన్షన్ లో ఘనంగా జరిగింది. వివాహ వేడుకలకు బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకులు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆయనతోపాటు మణికొండ మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్ ముదిరాజ్, చెక్కల ఎల్లయ్య, బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం నాయకులు కొలన్ సుభాష్ రెడ్డి , జాలిగం చిత్తారి, వివిధ పార్టీల నాయకులు నారగూడెం మల్లారెడ్డి , ఎం. కొమురయ్య, ఎస్. జయానంద్ రెడ్డి, డి. రమేష్ ముదిరాజ్, కాడెం సుధాకర్, జి. కరుణాకర్ రెడ్డి, సామాజిక కార్యకర్త మ్యాడం మధుసూదన్, రజక సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### రంగారెడ్డి జిల్లా లో....

రంగారెడ్డి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం జరిగిన వివాహ వేడుకల్లో పట్లోళ్ల కార్తీక్ రెడ్డి పాల్గొన్నారు. వధూవరుల ను ఆశీర్వదించి , బంధువులకు బంధువులను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.



అన్నదాన కార్యక్రమంలో భక్తులు

# ధర్మ సాయి సన్నిధిలో శ్రావణ మాస అన్నదానం

శంషాబాద్, ఆగస్టు 13( ప్రభాత ఉదయం) శంషాబాద్ పట్టణంలోని శ్రీ ధర్మసాయి మందిరంలో ఆదివారం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పవిత్రమైన శ్రావణమాసంలో సాయిబాబా దర్శనం పొందడం గొప్ప అదృష్టం అని దేవాలయ ట్రస్ట్ బోర్డు వ్యవస్థాపక చైర్మన్ ధరణి మాత. ట్రస్టు బోర్డు సభ్యుడు శివ సాయి దత్తు తెలిపారు. శ్రావణమాసంలో సాయిబాబా ఆశీస్సులు పొందడానికి భక్తులు ముందుకు వచ్చి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రతి ఆదివారం నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుందని తెలిపారు భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ధరణి మాత. శివ సాయి దత్తు కోరారు.



సర్వాయి సర్దార్ పాపన్న చిత్రపటానికి పుష్పాంజలి ఘటి స్తున్న నాయకులు

# ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న 374వ జయంతి

గద్వాల ,ఆగస్టు18(ప్రభాత ఉదయం)బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం విరోచిత పోరాటం చేసిన గొప్ప వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న అని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాసరావు అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న 374వ జయంతిని పురస్కరించుకొని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఐడిఓసిలో జిల్లా అధికారులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సాహస వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న మొగలులను, గోల్కొండ నవాబులను ఎదిరించి తెలంగాణ కీర్తి పతాకాన్ని ఎగరవేసిన గొప్పవీరుడని అన్నారు. సర్వాయి పాపన్న జయంతిని ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అధికారికంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి రమేష్ బాబు, జడ్పీ సీఈఓ కాంతమ్మ, షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ అధికారి సరోజ, కలెక్టర్ కార్యాలయ ఏఓ వీరభద్రప్ప, సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



పార్థీనియం కలుపు మొక్కల వలన కలిగే అనర్థాలను ప్రజలకు వివరిస్తున్న డాక్టర్ ఓ. పి. శర్మ, డాక్టర్ పైల జ్యోతి, డాక్టర్ దామోదర చారి లు

# పార్థీనియం కలుపు మొక్క వలన పర్యావరణానికి, మానవులకు, పశువులకు హాని

## పార్థినియం నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

బుద్వేల్, ఆగస్టు 18(ప్రభాత ఉదయం) : పార్థీనియం కలుపు మొక్క ను క్యారెట్ గ్రాస్, వయ్యారి భామ అని పిలుస్తారని ఇది వ్యవసాయం, పర్యావరణం , మానవ ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పు కలిగించే ఒక సమస్యాత్మక కలుపు మొక్క అని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్మెంట్ (ఎన్ ఐ పీ హెచ్ ఎం) డైరెక్టర్ డాక్టర్ ఓ పి శర్మ అన్నారు. ఇది 1950ల మధ్యకాలంలో మెక్సికో/అమెరికా నుండి భారతదేశంలోకి ప్రవేశపెట్టబడిన ఒక గ్రహాంతర కలుపు మొక్క అని గుర్తు చేశారు. మొదట్లో పార్థీనియం మొక్క ఖాళీ భూముల్లో పెరిగి ఇబ్బందిగా ఉంటే , ఇప్పుడు పంట పొలాల్లోనూ సమస్యాత్మకంగా మారిందన్నారు. ఇది మానవులలో చర్మ అలెర్జీ (చర్మశోథ), గవత జ్వరం, ఉబ్బసం వంటి ఆరోగ్య ప్రమాదాలను కలిగిస్తుందన్నారు. పశువులకు కూడా విషపూరితమైనదన్నారు. ఇది పంట ఉత్పాదకతను కోల్పోవడమే కాకుండా స్థానిక జీవవైవిధ్యాన్ని నాశనం చేస్తుందన్నారు. . ఉద్యానవనాలు, నివాస కాలనీలు, పండ్ల తోటలు వంటి ప్రజా సౌకర్య ప్రాంతాలలో ఇది ఇబ్బందిగా ఉంటుందన్నారు. ఇది పట్టణ ప్రాంతాల్లో దోమలు, బొద్దింకలు, ఎలుకలు మొదలైన ఇతర తెగుళ్ల కు ఆవాస స్థలంగా ఉంటుందన్నారు. . ఈ పార్థీనియం కలుపు గడ్డి, భూములు, పచ్చిక బయళ్లను ఆవరించి ఉండటం వల్ల మేత సరఫరా తగ్గుతుందన్నారు. ఇందుకుగాను ఈ కలుపు మొక్క ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని, జాతీయ మొక్కల ఆరోగ్య యాజమాన్య సంస్థ (ఎన్ ఐ పీ హెచ్ ఎం) ప్రతి సంవత్సరం దీని నిర్మూలించాడానికి అవగాహనా కార్యక్రమాలను ఆగస్టు 16 నుంచి 22 వరకు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎన్ ఐ పీ హెచ్ ఎం డైరెక్టర్ జనరల్, డాక్టర్ సాగర్ హనుమాన్ సింగ్ ఈ నెల 16 న ప్రారంభించడం జరిగిందన్నారు. భారతదేశంలోని పార్థీనియం ప్రభావాల గురించి వివరించారు . ఆరోగ్యం, పర్యావరణ భద్రత, వైవిధ్యం కోసం పార్థీనియం కలుపును తొలగించేందుకు చేతులు కలపాలని ప్రోత్సహించారు. ఎన్. ఐ. పీ. హెచ్. ఎం సిబ్బంది , ట్రైనీలందరూ పాల్గొని క్యాంపస్ ప్రాంగణం నుండి పార్థీనియంను తొలగించారు. ఈ నేపథ్యంలో ఎన్. ఐ. పీ. హెచ్. ఎం సిబ్బంది రాజేంద్రనగర్‌లోని బుద్వేల్ శ్రీ శివ సాయి కాలనీ లో అవగాహన వారోత్సవాలు నిర్వహించారు. కాలనీ ఆవరణలోని పార్థీనియం కలుపు మొక్కలను పెద్దఎత్తున తొలగించే కార్యక్రమంలో నిర్వాసితులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. డాక్టర్ఓపీ శర్మ, డైరెక్టర్-పీహెచ్ఎం పార్థీనియం ఆరోగ్య ప్రమాదాలు, దాని నియంత్రణ చర్యలను నివాసితులకు వివరించారు. సిబ్బంది, డాక్టర్ పైల జ్యోతి, డాక్టర్ దామోదర చారి, కాలనీ వాసులు ఎల్ శేషగిరి రావు, ఎస్. వెంకటేష్ లు పాల్గొన్నారు.

# విద్యుత్ శాఖ ఉద్యోగుల పదోన్నతులకు సంఘీభావం తెలిపిన జలమండలి ఓసి,బిసి జేఏసీ నాయకులు



హైదరాబాద్, ఆగస్టు18(ప్రభాత ఉదయం) విద్యుత్ శాఖలో పదోన్నతులు కల్పించాలని అధికారులు, సిబ్బంది చేస్తున్న డిమాండ్ కు జలమండలి బిసి అండ్ ఓసి జెఎసి నాయకులు, సెక్రటరీ సాయి కిరణ్ గౌడ్ మద్దతు తెలిపారు. ఉద్యోగుల పదోన్నతుల న్యాయమైన హక్కు అని ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పదోన్నతులను వెంటనే ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.



రాజేంద్రనగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఇంచార్జి ఏసీపీ గా వికారాబాద్ నుంచి వచ్చిన సి. శ్రీధర్ డిప్యూటీ కమిషనర్ కె రవి కుమార్ కు రిపోర్ట్ చేస్తున్న దృశ్యం

# రాజేంద్రనగర్ సర్కిల్ ఇంచార్జి టౌన్ ప్లానింగ్ ఏసీపీగా సి. శ్రీధర్

## టౌన్ ప్లానింగ్ విభాగంలో పూర్తి స్థాయిలో అధికారులను నియమించాలంటున్న ప్రజలు

బుద్వేల్, ఆగస్టు18( ప్రభాత ఉదయం) : జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ - 11 టౌన్ ప్లానింగ్ విభాగం ఏసీపీ గా సి శ్రీధర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. వికారాబాద్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న సీ శ్రీధర్ రాజేంద్రనగర్ టౌన్ ప్లానింగ్ ఏసీపీగా బదిలీ అయి డిప్యూటీ కమిషనర్ కె. రవి కుమార్ రిపోర్ట్ చేశారు.



సి. శ్రీధర్

### టౌన్ ప్లానింగ్ విభాగంలో పూర్తిస్థాయిలో అధికారులను నియమించాలి : ప్రజలు

జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ టౌన్ ప్లానింగ్ విభాగంలో పూర్తిస్థాయిలో అధికారులను నియమించాలని ప్రజలు, వివిధ కాలనీల సభ్యులు కోరుతున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ లో రాజేంద్రనగర్ తో పాటు అత్తాపూర్ , మైలార్దేవ్పల్లి , సులేమాన్ నగర్, శాస్త్రి పురం డివిజన్లు ఉన్నాయి . ఈ ఐదు డివిజన్లకు ఐదుగురు సెక్షన్ ఆఫీసర్లను నియమించాలని ప్రజలు కోరుతున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మానస హిల్స్ ప్రాంతంలో ఊర్జిత హెూమ్స్ లాంటి పెద్ద పెద్ద రియల్ ఎస్టేట్ సంస్థలు విల్లాలను నిర్మిస్తున్నారు. కొత్తగా అక్కడ ప్లాటింగ్ వచ్చింది. అత్తాపూర్ లో పెద్దపెద్ద అపార్ట్మెంట్ లు నిర్మిస్తున్నారు. గోల్డెన్ హైట్స్ కాలనీ , హ్యాపీ హెూమ్స్ కాలనీలలో బహుళ అంతస్తు భవనాలు నిర్మాణంలో ఉన్నాయి . గగన్ పహాడ్ ఓ బడా రియల్ ఎస్టేట్ సంస్థ విల్లా లతో పాటు, అపార్ట్ మెంట్ లను నిర్మిస్తోంది. కాటేదాన్, టీఎన్జీవోస్ కాలనీ, శాస్త్రి పురం, సులేమాన్ నగర్ డివిజన్లలో సైతం బహుళ అంతస్తు భవనాలు నిర్మిస్తున్నారు. వీటన్నిటినీ పర్యవేక్షించాలంటే ఒక్కొక్క డివిజన్ కు ఒక్కొక్క సెక్షన్ ఆఫీసర్ ఉండాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో గ్రేటర్ అదికారులు రాజేంద్రనగర్ సర్కిల్ టౌన్ ప్లాన్ విభాగానికి పూర్తిస్థాయిలో అధికారులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.



# 20 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కూకట్‌పల్లి, ఆగస్టు 18 (ప్రభాత ఉదయం) కూకట్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-2004 విద్యాసంవత్సరంలో, పదవ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక కార్యక్రమం ఆదివారం మూసాపేట్ లోని దేవి గ్రాండ్ హెరిటల్ లో ఘనంగా నిర్వహించుకున్నారు. కూకట్ పల్లి హై స్కూల్ లో చదువుకున్న రోజుల్లోని గత జ్ఞాపకాల్ని గుర్తు చేసుకున్నారు. పాఠశాల స్థాయి విద్యనభ్యసించే రోజులే రోజులని ఆ విలువైన రోజులు మళ్ళీ రావని విద్యార్థులు తమ మనసులోని మాటలను వ్యక్తపరిచారు. వారు చేసిన అల్లర్లు, ఆడిన ఆటలు, పాడిన పాటలు ఉపాధ్యాయులు తమకు పాటలను వివరించిన విధానాన్ని ఎన్నటికీ మర్చిపోలేము అని కొనియాడారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులు ప్రతి ఒక్కరికి మొమెంటులు అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ 20 సంవత్సరాలు పూర్వ విద్యార్థులు అయిన మిమ్మల్ని ఇప్పుడు ఇలా చూస్తూ ఉంటే మాకు కూడా పాత జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయని అన్నారు. ఇలా మీరందరూ మా ముందు ఇలా కూర్చొని ఉంటే ఇంకా మేము మీకు పాఠాలు బోధిస్తున్నాము అన్న భావన కలుగుతుంది అన్నారు. మిమ్మల్ని ఈ స్థాయిలో చూస్తుంటే గర్వంగా ఉందని, ప్రతి ఒక్కరూ మంచి స్థాయిలో ఉన్నందుకు సంతోషపడుతున్నామన్నారు. విద్యార్థి, విద్యార్థినులు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ చిన్నపిల్లల మాదిరిగా మారి ఆటపాటలతో సంతోషంగా గడిపారు. అనంతరం ఉపాధ్యాయులకు పూలమాలలు వేసి శాలువా కప్పి సత్కరించారు. మేము ఈ స్థాయిలో ఉన్నామంటే మీరు మాకు బోధించిన విద్యాభ్యాసం, నేర్పిన పద్ధతులు కారణమని విద్యార్థులు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వర్ణ లీల, విజయమ్మ, కృష్ణారెడ్డి, వెంకట్ రెడ్డి, శ్యామలాదేవి, తదితరులతోపాటు విద్యార్థి, విద్యార్థినులు పాల్గొన్నారు.

# రుణమాఫీ జరిగిన రైతుల కన్నా జరుగని వారే అధికంగా ఉన్నారు

## ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిసిసిబి డైరెక్టర్ బూర్కుంట సతీష్



శంషాబాద్, ఆగస్టు 18( ప్రభాత ఉదయం) రుణమాఫీ పథకంలో మాఫీ జరిగిన రైతుల కన్నా మాఫీ జరగని రైతులే అధికంగా ఉన్నారని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రుణ మాఫీ పథకం సంపూర్ణంగా అమలు జరగలేదని అర్హులైన అనేకమంది రైతులకు న్యాయం జరగలేదని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిసిసిబి డైరెక్టర్ శంషాబాద్ మండలం మల్కారం సింగిల్ విండో చైర్మన్ బూర్కుంట సతీష్ అన్నారు. ఏక మొత్తంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించి అమలుకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ రైతులందరికీ రుణమాఫీ జరగలేదని అన్నారు. 2 లక్షల రూపాయల వరకు ఉన్న రుణాలను ఏక మొత్తంలో మాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పినప్పటికీ ఇది పూర్తి స్థాయిలో అమలు జరగలేదని వివరించారు. తమ సహకార సంఘంలో 386 మంది లక్ష న్నర రూపాయల అప్పు తీసుకున్న రైతులు ఉ ండగా దాదాపు 200 మందికి ఇంకా మాఫీ జరగలేదని అన్నారు. వివిధ సాంకేతిక కారణాలను చూపిస్తూ అధికారులు రుణమాఫీ చేయడం లేదని ప్రభుత్వం జోక్యం చేసుకొని ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సతీష్ డిమాండ్ చేశారు.

# బంగ్లాదేశ్‌లో జరుగుతున్న హింసాత్మక సంఘటనలను నిరసిస్తూ ర్యాలీ



బంగ్లాదేశ్ లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు..



ర్యాలీలో పాల్గొన్న మహిళలు

బుద్వేల్, ఆగస్టు18(ప్రభాత ఉదయం) బంగ్లాదేశ్ లో హిందు వుల దేవాలయాల పైన, హిందువుల పైన జరుగుతున్న దాడులను ఆపాలని కోరుతూ ఆదివారం ర్యాలీ నిర్వహించారు. హిందు మహి ళల పైన జరుగుతున్న ఘోరమైన అత్యాచారాలను ఆపాలని నిరసన తెలియజేసారు. ఇప్పటివరకు చనిపోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని అత్తాపూర్ డివిజన్ రాంబాగ్ రోడ్ బ్రహ్మచారి మఠ్ నుంచి తేజస్వి నగర్ కాలనీ అత్తాపూర్ మీదుగా పిల్లర్ నవంబర్ 122 నుంచి 143 వరకు, అక్కడి నుంచి రాంబాగ్ గ్రౌండ్ వరకు శాంతియుతంగా క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి , సంతోష్ కుమార్ అగర్వాల్ , సురేష్ కుమార్ మోది , పవన్ భారతి , లక్ష్మీకాంత్ వ్యాస్, అశోక్ శర్మ , దత్త , అంకుర్ బన్సల్, అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు సాబాద విజయ్ కుమార్ , తేజస్వినగర్, శివాజీ నగర్, అత్తాపూర్, పాండురంగానగర్ వాసులు యువకులు ప్రజలు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### బహుజన విప్లవ వీరుడు, గోల్కొండ కోటపై మొట్టమొదటిగా జెండా ఎగరవేసి

# బహుజన రాజ్యాన్ని విస్తరించిన వ్యక్తి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్

**కూకట్ పల్లి నియోజకవర్గ ఇంచార్జి బండి రమేష్... సర్వాయి పాపన్న గౌడ్ పోరాట పటిమను ఆయన పౌరుషాన్ని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలి... టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం**

కూకట్‌పల్లి, ఆగస్టు 18 (ప్రభాత ఉదయం) బహుజన విప్లవ వీరుడు, మొట్టమొదటిగా గోల్కొండ కోటపై జెండా ఎగరవేసి బహుజన రాజ్యాన్ని విస్తరించిన వ్యక్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ అన్నారు. ఆదివారం శ్రీ శ్రీ సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 374 వ జయంతి సందర్భంగా పటేల్ శ్రీకాంత్ గౌడ్, పులి శివ గౌడ్ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ లో జరిగిన కార్యక్రమానికి కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్, టీపీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ సత్యం శ్రీరంగం ముఖ్య అతిథులుగా హాజరై విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ ఆత్మాభిమానం కోసం, అట్టడుగువర్గాల మనుగడ కోసం తనకు తెలియకుండానే కత్తి పట్టిన వీరుడు అని, రాచరికపు వ్యవస్థలో శిస్తు కట్టించుకుని అణిచేయడమే తప్ప పరిపాలన అంటే ఏంటో తెలియని చీకటి రోజుల్లో అట్టడుగువర్గాల బానిస బతుకుల్లో వెలుగులు నింపేందుకు పోరాడిన యోధుడని అని అన్నారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ మొగల్ సామ్రాజ్యంలో ప్రభువుల అండదండలు చూసుకుని అరాచకాలకు పాల్పడుతున్న జమీందార్లు, జాగీర్దార్ల పెత్తనానికి ఫుల్‌స్టాప్ పెట్టిన ఘనుడని అన్నారు. పాపన్న ఒక జాతికో, ఒక కులానికో పరిమితం కాదని, సమాజం కోసం పాటుపడిన మహనీయుడని, అలంటి వారి జీవితాలను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పుష్పరెడ్డి, ఏ బ్లా క్ అధ్యక్షులు పి. నాగిరెడ్డి, మాజీ కౌన్సిలర్లు



లక్ష్మణ్, సంజీవ్, శేఖర్ గజానంద్, దయానంద్ గౌడ్, పులి శ్రీకాంత్ గౌడ్, సదానందం గౌడ్, దండు రవి, కూన సత్యం గౌడ్, కూన రవీందర్ గౌడ్, రాము గౌడ్, శంకర్ గౌడ్, వెంకటేష్ గౌడ్, మధు మోహన్, మరియు పెద్ద ఎత్తున గౌడ సోదరులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## వడ్డెరల స్మశాన వాటికలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

**ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి కి వినతి పత్రం అందజేసిన సంఘం ప్రతినిధులు**

మల్కాజిగిరి, ఆగస్టు18(ప్రభాత ఉదయం) మల్కాజిగిరి నియోజకవర్గం లోని మౌలాలి డివిజన్ పరిధిలోని వడ్డెరల స్మశాన వాటికలో మౌలిక సదుపాయాల కల్పించాలని శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి కి సంఘం ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఆదివారం మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ని కలిసిన వడ్డెర కులస్తులు, నాయకులు స్మశాన వాటికలో కనీస వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారు. అందుకు ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి సానుకూలంగా స్పందించి వీలైనంత త్వరగా వడ్డెర స్మశాన వాటికలో కావలసిన సముదాయాల కొరకు ప్రతిపాదనలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... వెనకబడిన వడ్డెర కులం ఆర్థికంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని, ఇటీవల జరిగిన శాసనసభ సమావేశాల్లో వడ్డెర కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వడ్డెర సంఘం ఉపాధ్యక్షుడు గండికోట కుమార్, మౌలాలి అధ్యక్షుడు నర్సింగ్ రావు, కోశాధికారి రమేష్, సలహాదారుడు చంద్రయ్య తదితరులున్నారు.



ఎమ్మెల్సీగా నియమితులైన కోదండరాంకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న టీజేఎస్ నాయకులు

## ఎమ్మెల్సీ కోదండరాంకు శుభాకాంక్షలు తెలిపిన టీజేఎస్ నాయకులు

హైదరాబాద్, ఆగస్టు18(ప్రభాత ఉదయం) తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్ ఎమ్మెల్సీగా నియమితులైన సందర్భంగా టీజేఎస్ నాయకులు ఆయన స్వగృహానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కోదండరాంకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఎమ్మెల్సీ గా నియమించింది. ఎమ్మెల్సీగా పదవి ప్రమాణ స్వీకారం చేసిన కోదండరాంకు ఆదివారం టీజేఎస్ నాయకులు ఆయన ఇంటి వద్ద తెలంగాణ జేఏసీ నాయకులు తెలంగాణ టీజేఎస్ నాయకులు కోదండరామ ని కలిసి శుభాకాంక్షలు తెలిపారు . మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా టీజేఎస్ నాయకులు, టీజేఏసీ నాయకులు రెడ్డిపల్లి శ్రీనివాస్, భద్ర గాని ఆంజనేయులు, అశోక్ రెడ్డి, దయాకర్, ఏర్పుల దయాకర్, బాలాజీ నగర్ శ్రీనివాస్ అశోక్, సంజయ్ లు శుభాకాంక్షలు తెలియజేశారు.

## బరితెగిస్తున్న దొంగలు

**ఆందోళన చెందుతున్న అన్నదాతలు**



గద్వాల ,ఆగస్టు18(ప్రభాత ఉదయం)దొంగలు బరితెగిస్తున్నారు. రైతులు తమ పొలాలకు నీళ్లు పారించుకునేందుకు ఏర్పాటు చేసిన పంపు మోటార్ల కేబుల్ వైర్లను ఎత్తుకెళ్తున్నారు. వ్యవసాయ పంపు మోటార్లకున్న కేబుల్ వైర్లను కట్ చేసి, వాటిని తీసుకుని పరారవుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ధరూర్ మండలంలోని ఆయా గ్రామాల రైతులు తమ వ్యవసాయ పొలాలకు నీరు పారించుకునేందుకు నెట్టెంపాడు ఎత్తిపోతల భాగంగా నిర్మించిన కాలువకు పంపు మోటార్లు వేసుకొన్నారు. గత కొన్ని రోజులుగా రాత్రి సమయంలో గుర్తు తెలియని దొంగలు పంపు మోటార్ ల కేబుల్ వైర్లను ఎత్తుకెళ్తున్నారు. సుమారు 40 మంది రైతులకు చెందిన కేబుల్ వైర్లు చోరీకి గురైనట్లు బాధితులు తమ అవేదను వ్యక్తం చేస్తున్నారు. ఇలా సీజన్ వచ్చిందంటే చాలు దొంగలు కరెంటు కేబుల్ వైర్లను కట్ చేసి ఎత్తుకెల్తుడటంతో రైతులను నిద్రలేకుండా చేస్తున్నారని పలువురు వాపోయారు. అప్పులు చేసి కొత్త కేబుల్ వైర్లను కొనుగోలు వేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కొక్క కేబుల్ వైర్ విలువ సుమారు. 3వేలకు పైగా ఉండటంతో కేబుల్ వైర్లను కట్ చేసి, వైర్లను కాల్చి అందులో ఉన్న విలువైన కాఫర్ వైర్ ను సేకరించి బయట మార్కెట్ లో విక్రయించేందుకు ఈ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సంవత్సరంలో నాలుగైదు సార్లు ఇలా దొంగలు కేబుల్ వైర్లను దొంగిలించుకపోవడం షరా మామూలైందన్నారు. గతంలో కేబుల్ వైర్లను ఎత్తుకెళ్లినప్పుడు ధరూర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు, పోలీసులు దొంగలపై నిఘా ఉంచి... కేబుల్ వైర్లను ఎత్తుకెళ్తున్న దొంగలను గుర్తించి చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.



సర్వాయి సర్దార్ పాపన్నకు నివాళులర్పిస్తున్న మాజీ జడ్పీ చైర్మన్ సరిత

## నడిగడ్డలో అరాచక పాలనకు స్వస్తి పలుకుద్దాం

**గద్వాల జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ సరిత**

గద్వాల,ఆగస్టు18(ప్రభాత ఉదయం) బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌ను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకొని నడిగడ్డలో అరాచక పాలనకు స్వస్త పలుకాలని జెడ్పీ మాజీ చైర్ పర్సన్ సరిత పిలుపునిచ్చారు.గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని మాజీ జెడ్పీ చైర్ పర్సన్ నివాసంలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న 374వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సరిత మాట్లాడుతూ శతాబ్దాల కిందటే రాచరిక నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పేదప్రజలను సంఘటితం చేసి, రాజకీయ-సామాజిక సమానత్వమే మూల సూత్రంగా గోల్కొండను ఏలిన బహుజన చక్రవర్తిగా సర్వాయి పాపన్న చరిత్ర అసామాన్యమైనదని కొనియాడారు. సర్వాయి పాపన్న పోరాటస్ఫూర్తితో ప్రజాప్రభుత్వం వారి ఆశయాలను కొనసాగిస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మధుసూదన్ బాబు,కౌన్సిలర్లు నరహరి గౌడ్, శ్రీనివాస్ గౌడ్,అల్వాల రాజశేఖర్ రెడ్డి, ఆనంద్ గౌడ్,అమరావాయి కృష్ణారెడ్డి,టి.శ్రీనివాసులు, జనార్ధన్ గౌడ్, నర్సన్ గౌడ్,డిటిడిసి నర్సింహులు, నాగేంద్ర యాదవ్,శెట్టి ఆత్మకూరు లక్ష్మణ్,కృష్ణయ్య గౌడ్, కొండపల్లి రాఘవేంద్ర రెడ్డి,రామచంద్ర గౌడ్,వెంకటస్వామి గౌడ్,శెట్టి ఆత్మకూరు కృష్ణయ్య గౌడ్, తుంకుంట కృష్ణయ్య గౌడ్, రాఘురామి రెడ్డి, జగదీష్,డి.ఆర్.శ్రీధర్,దడవాయి నర్సింహులు, కుమ్మరి నారాయణ,సుదీర్,రంగస్వామి గౌడ్ తదితరులు తదితరులు ఉన్నారు.



## శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

మల్కాజిగిరి, ఆగస్టు 18(ప్రభాత ఉదయం) మల్కాజిగిరి ఆనంద చౌరస్తాలో గల శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు పురస్కరించుకొని మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. వారితోపాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి ఎన్ వి సతీష్ కుమార్ ,గణేష్ ముదిరాజ్ ,సంతోష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా బిజెపి అధ్యక్షులు రామచంద్రారెడ్డి

## రైతులకు సంపూర్ణంగా రుణమాఫీ అందజేయాలి

**జిల్లా బిజెపి అధ్యక్షులు రామచంద్రారెడ్డి**

గద్వాల,ఆగస్టు18(ప్రభాత ఉదయం) అర్హులైన రైతులకు సంపూర్ణంగా రుణమాఫీ అందజేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం గద్వాల పట్టణంలోని డికె. బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.... రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ రైతులపై వివక్ష చూపుతుందన్నారు. రైతే రాజు అన్న విషయాన్ని మరచి అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో ఉన్న అందరూ రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి రూ.40 వేల కోట్ల రూపాయలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రుణమాఫీపై తొలి సంతకం చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ నేడు రుణమాఫీ విషయంలో ఆహార భద్రత కార్డు ను అనుసంధానం చేసి రైతులను మోసం చేస్తుందన్నారు. కేవలం 40 శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ అందజేసిందన్నారు. రైతుల అందరికీ రుణమాఫీ చేశామని అబద్ధాలు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ విషయంలో పూర్తిస్థాయిలో రైతులకు రుణమాఫీ చేసిందని అబద్ధపు మాటలు చెప్పడంలో ఎంత మాత్రం నిజం ఉందని మీరు చెప్పిన అబద్ధపు మాటలను రాష్ట్ర రైతాంగం గమనిస్తుందని అన్నారు. రాబోయే రెండు రోజుల్లో బీజేపీ పార్టీ ఆధ్వర్యంలోప్రతి గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించి ప్రతి రైతు దగ్గరకు వెళ్లి రైతు రుణమాఫీ గురించి తెలుసుకొని జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అపద్ధపు హామీలను ఎండగడతామని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్ ఎక్బోటే, అసెంబ్లీ కన్వీనర్ రామాంజనేయులు , జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు మల్లెందొడ్డి వెంకటేశ్వర రెడ్డి, జిల్లా ఓబిసి మోర్చా అధ్యక్షుడు దేవదాస్ , తదితరులు ఉన్నారు.



## తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, ధీరత్వానికి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ప్రతీకగా నిలుస్తారు

**శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జగదీశ్వర్ గౌడ్**

కూకట్‌పల్లి, ఆగస్టు 18 (ప్రభాత ఉదయం) సబ్బండ వర్గాలకు రాజకీయ, సామాజిక సమానత్వం కోసం పాపన్న చేసిన కృషి చరిత్రలో నిలిచిపోతుందని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ వి.జగదీశ్వర్ గౌడ్ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని మియపూర్ అల్విన్ కాలనీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా అల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, మాజీ కార్పొరేటర్ అశోక్ గౌడ్, నియోజకవర్గ నాయకులతో కలిసి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి కృషిని, పోషించిన చారిత్రక పాత్రను స్మరించుకున్నారు, కుల, మతాల వివక్ష లేకుండా అన్ని వర్గాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం దక్కాలనే సమ సమాజ ప్రజాస్వామిక స్ఫూర్తితో ఆనాటి కాలంలోనే పాపన్నగౌడ్ పోరాడడం గొప్ప విషయమన్నారు. విశ్వకీర్తిని పొందిన పాపన్న గొప్పతనాన్ని స్మరించుకునేందుకు ప్రతి ఏటా వారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఘనంగా నిర్వహిస్తున్నదని తెలిపారు.తెలంగాణ స్వయం పాలనలో సబ్బండ వర్గాలకు రాజకీయ అధికారంలో భాగస్వామ్యం లభించిందని, స్వరాష్ట్రంలో వేలాది మంది దళిత, బహుజన బిడ్డలను నాయకులుగా తీర్చిదిద్దడం ద్వారా పాపన్నగౌడ్ ఆశయాలను కాంగ్రెస్ పార్టీ, కేంద్రాల్లో, రాష్ట్రంలో అమలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ గౌడ సంఘం అధ్యక్షులు లక్ష్మీనారాయణ గౌడ్, ఓం ప్రకాష్ గౌడ్, మూల వెంకటేష్ గౌడ్, కనకమామిడీ నరేందర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, రచమల్ల వెంకటేష్ గౌడ్, యాదగిరి గౌడ్, కరుణాకర్ గౌడ్, పుట్టా వినయ్ కుమార్ గౌడ్, ఏకాంత్ గౌడ్, నాగులు గౌడ్, సురేష్ గౌడ్, కూన సత్యం గౌడ్, రక్తపు శ్రవణ్ గౌడ్, మూల అనిల్ గౌడ్, విజయభాస్కర్ రెడ్డి, నవీన్ రెడ్డి, యల్లమంచి ఉదయ్ కుమర్, రామచందర్ గౌడ్, రవి కుమార్ గౌడ్, రాజు గౌడ్, శ్రీనివాస్ గౌడ్, జనార్దన్ గౌడ్, మహిళలు కల్పన గౌడ్, శిరీష సత్తుర్, మహాలక్ష్మి, శ్రావణి, స్వప్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ పాపన్న గౌడ్ జీవితం అందరికీ ఆదర్శం: సురేష్ గౌడ్

శంషాబాద్,ఆగస్టు 18( ప్రభాత ఉదయం) సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం ప్రజలందరికీ ఆదర్శమని ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని శంషాబాద్ మండలం పెద్ద తూప్రా గ్రామ మాజీ పంచాయతీ సభ్యుడు మండల గౌడ సంఘం నాయకుడు బి సురేష్ గౌడ్ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374 వ జయంతి సందర్భంగా గౌడ సంఘం ఆధ్వర్యంలో పెద్ద తూప్రా గ్రామంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సురేష్ గౌడ్ మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా షాపూర్ లో జన్మించిన సర్దార్ పాపన్న గౌడ్ ఆనాటి పాలకులు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు అరాచకాలపై తిరుగుబాటు చేశారని తెలిపారు. ప్రజలకు జరుగుతున్న అన్యాయంపై తిరుగుబాటు చేసి వారికి న్యాయం జరిగేలా విస్తృతమైన పోరాటాన్ని చేశారని అన్నారు. అనంతరం కేకును కట్ చేసి సభ్యులందరికీ పంచారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు బి రవి గౌడ్. కే నరసింహ గౌడ్. డి వెంకటేష్ గౌడ్. జంగయ్య గౌడ్. లక్ష్మణ్ గౌడ్. అభి గౌడ్. ప్రవీణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.